# కంకర రోడ్డుతో కష్టాలు..



కుక్కింద గేటు-గడ్డమీది గంగారం గ్రామాల మధ్య ఉన్న కంకర రోడ్డు

ధారూరు, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని రాజాపూర్-మోమిన్‌ఖుర్దు గ్రామాల మధ్య ఉన్న కంకర రోడ్డుతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే కంకర రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ధారూరు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ రాజుగుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాజాపూర్-మోమిన్‌ఖుర్దు రోడ్డు మంజూరు చేసి పనులు ప్రారంభించి కంకర వేశారు అంత లోనే ఎన్నికలకోడ్ అమలులోకి రావడంతో పనులు ఆపివేశారు అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారుగా 14నెలలు అవుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. రాజాపూర్-మోమిన్‌ఖుర్దు గ్రామాల మధ్య ఉన్న కంకర రోడ్డు, కుక్కింద గేట్- గడ్డమీది గంగారం గ్రామాల మధ్య ఉన్న కంకర రోడ్డు లను బీటీ రోడ్డులుగా మార్చలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంకర రోడ్డులతో ఆయా గ్రామాల ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలి పారు. ఇప్పటికైనా బీటీ రోడ్డు వేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

## విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన



కులకచర్ల, ఫిబ్రవరి 24 : మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులకు క్రమశిక్షణతో కూడిన విద్య, బాల్యవివాహాల నిర్మూలన, ఆరోగ్యంగా ఉండటానికి తీసు కోవల్సిన జాగ్రత్తలు వంటి వాటిపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మొబైల్‌ను దూరంగా ఉంచాలన్నారు. బడీడు పిల్లలు బడి బయట ఉంటే వారిని బడికి పంపించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠ శాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్యగౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు, మ్యాజిక్ బస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐతో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య



ఎన్నారం పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎంఈవో చంద్రప్ప

బంట్వారం/కోట్‌పల్లి, ఫిబ్రవరి 24: ఆర్టిఫీసియల్ ఇంటలిజెన్స్ ద్వారా ప్రతి విద్యార్థి ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో చంద్రప్ప పేర్కొన్నారు. సోమవారం కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్నారం గ్రామంలో ఏఐ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ లాబోరేటరి ద్వారా ప్రతి విద్యార్థికి సాంకేతికంగా, భాషా, గణితం లాంటి విషయాల సామర్థ్యం పెంపొందుతుందని చెప్పారు. నేడు ప్రభుత్వం ఏఐకి ప్రాధాన్యతనిస్తుందని, ఈ ప్రోగ్రామ్ వల్ల ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ నర్సింహులు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాద్యాయురాలు శారద, ఎంపీపీఎస్ ప్రాధానోపాద్యయులు శేఖర్, ఇతర ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, కవిత, సంపత్, ముక్తార్ షరీఫ్, లావణ్య, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షించిన రైతులు



కొడంగల్, ఫిబ్రవరి 24: పీఎం కిసాన్ సమ్మాన్ నిధికింద రైతు 19వ విడత ఆర్థిక సాయాన్ని బీహార్‌లోని భాగల్పూర్‌లో భారత ప్రధాని నరేంద్రమోదీ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పర్సాపూర్ గ్రామ రైతు వేదికలో వ్యవసాయాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌ను ద్వారా రైతులు వీక్షించే ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శంకర్ రాథోడ్, కొడంగల్, బొంరస్‌పేటల ఏవోలు తులసి, దుద్యాల్ ఏవో హిమబిందు, దౌల్తాబాద్ ఏవో లావణ్యలతో పాటు ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పాత్ర చాలా విలువైనది



కులకచర్ల, ఫిబ్రవరి 24 : ఉత్తమ విద్యాబోధకులకు ఉద్యోగ విరమణ చేసిన మంచి గుర్తింపు ఉంటుందని తెలంగాణ గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు హరిలాల్ కులకచర్ల మండల విద్యాధికారి అబీబ్‌హైమద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇప్పాయిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను మెరుగు పర్చిన ఉపాధ్యాయుల పాత్ర చాలా విలువైనదని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అనేది దేవుడు ఇచ్చిన వరంలాంటిదని అలాంటి వృత్తికి న్యాయం చేసిన ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దోమ ఎంఈవో వెంకట్, చౌడాపూర్ ఎంఈవో రాంచందర్, ఎంఎస్‌వో జైపాల్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్నాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పద్మరఘుగౌడ్, బాల్‌రెడ్డి, ఆనంద్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, రామచంద్ర, శరత్‌కృష్ణ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో బస్‌షెల్టర్లు

■ అవస్థలు పడుతున్న ప్రయాణికులు ■ మౌలిక సౌకర్యాలు కల్పించాలని వినతి



హైవే రోడ్డు నుంచి పూడూరు మండల కేంద్రానికి వెళ్లే స్టేజీ

పూడూరు, ఫిబ్రవరి 24: ప్రయాణికుల సౌకర్యం కోసం పలు రోడ్డు మార్గాల్లో నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూడూరు మండల పరిధిలో హైదరాబాద్-బీజాపూర్ అంతర్రాష్ట్ర రోడ్డుతో పాటుగా, గ్రామీణ ప్రాంతాల మీదుగా రంగారెడ్డి జిల్లా నుంచి వికారాబాద్ జిల్లా పరిధిలో నుంచి మహబూబ్ నగర్ జిల్లాను కలిపే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గం ఉంది. హైదరాబాద్-బీజాపూర్ మార్గంలో అంగడి చిట్టంపల్లి, కండ్లపల్లి, పూడూరు, రాకంచర్ల, సోమన్‌గుర్తి స్టేజీల వద్ద గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం సోమన్‌గుర్తి స్టేజీల వద్ద ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉన్న అంగడి చిట్టంపల్లి, పూడూరు, రాకంచర్ల స్టేజీల వద్ద పూర్తిగా శిథిలావస్థకు చేరుకొగా కొందరు కబ్జాకు పాల్పడగా, కండ్లపల్లి స్టేజీ వద్ద లారీ ఢీకొని కూలిపోయింది. అంగడి చిట్టంపల్లి నుంచి మహబూబ్ నగర్ జిల్లా వెళ్లే లాల్‌పహడ్ రోడ్డు మార్గం వరకు సుమారుగా ఆయా గ్రామాల్లో ఎనిమిది స్టేజీల వరకు ఉంటాయి. ఈ రోడ్డు మార్గంలో చింతల్‌పల్లి స్టేజీ వద్ద ప్రయాణికుల సౌకర్యం కోసం ఓ స్వచ్ఛంద సంస్థ బస్‌షెల్టర్ నిర్మించింది. హైదరాబాద్ -బీజాపూర్ హైవే రోడ్డుపై గానీ గ్రామీణ ప్రాంతాల్లో నుంచి వెళ్లే రోడ్డు మార్గంలో గానీ ప్రయాణికుల సదుపాయం కోసం బస్ షెల్టర్ల నిర్మాణంపై సంబంధిత ఆర్టీసీ అధికారులు దృష్టి పెట్టడంలేదనే విమర్శలు ఉన్నాయి. మన్నెగూడ-వికారాబాద్ రోడ్డు మార్గంలోని మోడల్ స్కూల్ వద్ద విద్యార్థుల సౌకర్యం కోసం జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి బస్‌షెల్టర్ నిర్మాణం కోసం ఏడు సంవత్సరాల క్రితం భూమిపూజ నిర్వహించారు. కాని ఇప్పటి వరకు ఆ స్కూల్ వద్ద షెల్టర్ నిర్మాణ పనులు ప్రారంభించనులేదు. పూడూరు మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వికారాబాద్, పరిగి ఆర్టీసీ డిపోల బస్సులు నడుపుతున్నారు. ఆయా స్టేజీల వద్ద బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో బస్ షెల్టర్లు లేక వారు వర్షంలో, ఎండలో, చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వికారాబాద్ బస్ డిపో మంచి ఆర్థికంగా లాభాలు గడించింది. కానీ ప్రయాణికులకు మౌలిక సౌకర్యలు కల్పించడంలో మాత్రం ఆ డిపో అధికారలు శ్రద్ధ చూపడంలేదనే విమర్శలు పలు ప్రాంతాల ప్రయాణికుల నుంచి వ్యక్తమౌతున్నాయి . మండల పరిధిలోని ప్రయాణికులు పరిగి, వికారాబాద్ రెండు ప్రాంతాలకు నిత్యం అధిక సంఖ్యలో బస్సులోనే ప్రయాణం చేస్తారు. వాస్తవానికి ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రతి స్టేజీల వద్ద బస్ షెల్టర్ నిర్మించి మంచి నీటి చేతి పంపుల సౌకర్యం కల్పించాలి. కాని ఆర్టీసీ అధికారులు మాత్రం ప్రయాణికుల వసతుల పై దృష్టి పెట్టడంలేదు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారలు గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌకర్యం కోసం బస్ షెల్టర్ల నిర్మాణంతో పాటుగా తాగు నీటి చేతి పంపులు ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

**కనీస సౌకర్యాలు కల్పించాలి**



బస్‌షెల్టర్, తాగు నీటి సౌకర్యాలు లేక పావడంతో చాల ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాం. బస్ షెల్టర్ ఉంటే ఎండకాలం, వర్ష కాలం, చలి కాలంలో ప్రయాణించే వారికి సౌకర్యంగా ఉంటుంది. పరిగి, వికారాబాద్ డిపోల పరిధిలోకి పూడూరు మండల గ్రా మాలు వస్తాయి. వెంటనే అంగడి చిట్టంపల్లి స్టేజీ నుంచి లాల్‌ప హడ్, వికారాబాద్ నుంచి హైదరాబాద్, మన్నెగూడ నుండి పరిగి మార్గంలోని స్టేజీల వద్ద బస్ షెల్టర్లు నిర్మించాలి.

**-మల్గ కిష్టయ్య రైతు, అంగడిచిట్టంపల్లి**

# ఏఐ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



గడిసింగాపూర్ పాఠశాలలో ఏఐ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

పరిగి, ఫిబ్రవరి 24 : సాంకేతికతతో కూడిన విద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి తెలిపారు. సోమవారం పరిగి మండలం గడిసింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పాఠ్యాంశాల బోధన తరగతులను అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉండే ఏఐ విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఐ ద్వారా చక్కటి సాంకేతికతతో కూడిన విలువైన పాఠ్యాంశాలు నేర్చుకోవాల్సిందిగా విద్యార్థులకు సూచించారు. ఏఐ తరగతులు బోధించేందుకు ఉపాధ్యాయులకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, ఎఎంవో రామ్‌మస్తాన్, మండల విద్యాధికారి గోపాల్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సులభ పద్ధతిలో నేర్పించేందుకు..**

దోమ, ఫిబ్రవరి 24 : చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి కంప్యూటర్ ఆధారంగా సులభ పద్ధతిలో నేర్పించేందుకు ఏ1 డిజిటల్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. సోమవారం దోమ మండల పరిధిలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు సాంకేతిక విద్యను అభ్యసించుటకు గాను ఏ1 డిజిటల్ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ప్రతి జిల్లాలో ఆరు పాఠశాలలను ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రమేశ్, ఎంఈవో వెంకట్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షఫీ, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో నరేందర్, ఆర్ఐ సురేందర్, పంచాయతీ కార్యదర్శి మీనా, పాఠశాల కమిటీ చైర్మన్ నసీమ, సీఆర్‌పి వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**బిల్లులు చెల్లించాలని ట్రైనీ కలెక్టర్‌కు వినతి**

కులకచర్ల, ఫిబ్రవరి 24 : మన ఊరు-మనబడి పనులకు సంబంధించి పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతికి సోమవారం మాజీ పాఠశాల కమిటి చైర్మన్‌లు బొంపల్లిలో వినతిపత్రం సమర్పించారు. పాఠశాలల్లో పనులు నిర్వహించినా ఇప్పటివరకు డబ్బులు రాక ఇబ్బందులు పడుతు న్నామని మాజీ ఎస్ఎంసీ చైర్మన్‌లు ట్రైనీ కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. తాము పాఠశాలల్లో పనులు నిర్వహించడానికి గాను ఇతరుల దగ్గర డబ్బులు అప్పుకు తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. వాటికి మిత్తులు కట్టలేక ప్రభుత్వం నుంచి పనిచేసిన డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మన్నారు. మన ఊరు-మన బడి పథకంలో చేసిన పను లకు గాను డబ్బులు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిధిలోని ముజాహిద్‌పూర్, దోమ మండలానికి చెందిన మన ఊరు-మన బడి పథకం కింద పనులు నిర్వహించిన పాఠశాల మాజీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

## కంటైనర్‌ను ఢీకొట్టిన బైక్‌లు

**యువకుడు మృతి, ఇద్దరికి గాయాలు**

పరిగి, ఫిబ్రవరి 24: ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొనగా ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి పరిగి పట్టణ శివారులో జరిగింది. ఎస్ఐ సంతోష్‌కుమార్ కథనం ప్రకారం కొడంగల్ వైపు నుంచి పరిగి వైపు వస్తున్న కంటైనర్‌ను పరిగి నుంచి కొడంగల్ వైపు వెళ్తున్న రెండు మోటార్‌సైకిళ్లు సోమవారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో పట్టణ శివారులోని బ్రిడ్జి సమీ పంలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో పరిగి మండలం రం గంపల్లి గ్రామానికి చెందిన యువకుడు ముష్టి శ్రీశైలంకు తీవ్ర గాయాలవడంతో మృతిచెందాడు. మోటార్ సైకిళ్లపై వెళ్తున్న మరో ఇరువురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం పరిగి ఆసుపత్రికి తరలించారు.

**కారు, బైక్ ఢీ ఇద్దరికీ గాయాలు**

మర్పల్లి, ఫిబ్రవరి 24: పట్లూర్ గ్రామానికి చెందిన మోమ్లా మోష, కారింపూర్ గ్రామానికి చెందిన ప్రభు మరికొంత మంది కుటుంబ సభ్యులతో కలిసి మొగిలిగుండ్ల గ్రామానికి ఓ వివాహ విషయంలో వెళ్తుండగా బూచన్‌పల్లి గ్రామానికి చెందిన రమేశ్ కారులో భూదేరా నుంచి మర్పల్లి వస్తున్నాడు.. ఈ క్రమంలో కారు బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి.. దీంతో మోష, ప్రభులకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు సంగారెడ్డిలోని ఓ దవాఖానాకు తరలించి చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు.

**కరెంటు సరఫరాలో అంతరాయం**

పరిగి, ఫిబ్రవరి 24: 33 కేవీ కొత్త విద్యుత్ లైను పనుల వల్ల పరిగి మున్సిపాలిటీ, పరిగి, రంగంపల్లి, రాపోల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ లైన్‌లలో మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఆర్.హరిక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు



నవాబుపేట, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలో మొదలుకుని వివిధ గ్రామాల్లో గల సీసీ, బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసమైనవని వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని జిల్లా అధికారులుగా మండల రోడ్ల దుస్థితిని బాగుచేయండని వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యా లయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యనిర్వహణ అధ్యక్షుడు వడ్ల పురుషోత్తంచారి, శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి పోలీసు మహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందరెడ్డి, సీనీయర్ నేత జగన్‌రెడ్డి ఉన్నారు.



వికారాబాద్, ఫిబ్రవరి 24 : మూసీ ప్రక్షాళనను.. మూసీ జన్మస్థలం నుంచి చేపట్టాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో మూసీ నదిని ప్రక్షాళన చేయాలని, వికారాబాద్ మున్సిపాలిటీ లోపల డ్రైనేజీ నీళ్లతో బావులు బోర్లు డ్రైనేజ్ వాటర్ లీకేజీతో కలుషితం అవుతున్న వాటి పై శాశ్వతమైన పరిష్కారం చూపాలని చెప్పి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌కు, అదేవిధంగా మున్సిపల్ ఆఫీస్‌లో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గఫర్, సత్యనారాయణ , యాదయ్య , భరత్ , సుభాష్, సురేందర్ రెడ్డి , నరసింహ , నగేష్ , సాజిద్, శ్రీనివాస్, రాఘవేందర్ రెడ్డి , అక్రమ్, మహేందర్ , రాజు, అత్తాపూర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఏఐ ల్యాబ్ ప్రారంభం..

యాలాల, ఫిబ్రవరి 24: ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రారంభించిన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఎఫ్ఎల్ఎన్‌లో విద్యా ర్థులకు బాష, గణిత సామర్థ్యల అభివృద్ధి కోసం ఏఐ ల్యాబ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఏఎమ్ఓ రాంమస్త అన్నారు. సోమవారం తాండూరు పట్టణంలోని సాయిపూర్ పాఠశాలలో ఎంఈఓ వెంక టయ్యగౌడ్‌తో కలసి ఏఐ ల్యాబ్‌ను ప్రా రంభించారు. అనంతరం మాట్లాడుతూ... వెనకబడిన విద్యార్థులకు ఇది ఎంతో ఉప యోగకరంగా ఉంటుందన్నారు. ఏఐ ల్యాబ్ యొక్క సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉప యోగించి విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించవచ్చున్నారు.



కొడంగల్, ఫిబ్రవరి 24: దుద్యాల మండలం పోలేపల్లి గ్రామంలో వెలసిన ఎల్లమ్మతల్లికి నాలుగు రోజులుగా జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 109 ఫిర్యాదులు..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 24 : ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 109 ఫిర్యాదులు వచ్చినట్లుగా గుర్తు చేశారు. మండలాలకు సంబంధించిన పలు గ్రామాల ప్రజలు ఇచ్చిన భూ సమస్యలపై ఫిర్యాదులను పరిశీలించారు. ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలనీ ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదు దారులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సమస్యలు ) సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అవగాహన



సమావేశంలోలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, ఫిబ్రవరి 24 : మండల పరిధిలోని అనంతసాగర గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన 163 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకాగా లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కట్టే తీరును, లబ్ధిదారులతో పాటు మేస్త్రీలకు వివరించినట్లు తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సయ్యద్ మక్రం బాబ, ఏఈ హౌసింగ్ సందాని, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

మర్పల్లి, ఫిబ్రవరి 24 : అనుమానాస్పద స్థితిలో బావిలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కోటమర్పల్లిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. తోకల వినోదమ్మ (63) కు విమలమ్మ, జ్యోతి ఇద్దరు కుమార్తెలు ఇద్దరికి వివాహాలు జరిగాయి.. వినోదమ్మ కొన్ని రోజులు ఇంటి వద్ద కొన్ని రోజులు కూతుర్ల వద్ద ఉండేదని.. ఎప్పటి లాగానే ఆదివారం రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రించింది.. సోమవారం ఉదయం వినోదమ్మ ఇంటి తలుపులు తీయక పోవడంతో ఇంటి పక్కన ఉన్నవారు.. చూడగా ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించి వారు గ్రామస్తులకు తెలుపడంతో తలుపులు తీసి చూడగా బీరువాలో నుంచి పొగలు కనిపించాయి. బంగారానికి సంబంధించి వినోదమ్మ మెడలోని గుండ్ల మద్యలో ఉండే రాఖీ బావి వద్ద కనిపించింది.. బావిలోకి చూడగా ఆమె చీర కనిపించగా దాన్ని పట్టుకుని తీయడంతో వినోదమ్మ మృతదేహం బయటకు వచ్చింది.. దీంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మెడలో ఉన్న బంగారం తీసుకొని ఆమెను బావిలో తోసివేసినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.. ఘటన స్థలాన్ని వికారాబాద్ డీఎస్సీ శ్రీనివాస్ రెడ్డి, మోమిన్‌పేట్ సీఐ నావీణ్ గౌడ్, ఎస్సై ఆనంద్ మర్పల్లి ట్రైని ఎస్సై పుడ్లిక్ డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం సిబ్బందితో పరిశీలించారు.. మృతురాలి కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.. మృతదేహాన్ని మర్పల్లి ప్రభుత్వ దవఖానాకు తరలించి పోసుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**చోరీలకు పాల్పడిన నిందితుడు రిమాండ్**

షాబాద్ (మొయినాబాద్), ఫిబ్రవరి 24: మొయినాబాద్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో చోరీకి పాల్పడి గచ్చిబౌలిలో కాల్పుల ఘటనలో అరెస్టై జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితుడిని మొయినాబాద్ పోలీసులు రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారణ చేపట్టారు. సీన్ రీ కంస్రక్షణ్ నిర్వహించి కీలక వివరాలు సేకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గత డిసెంబర్ 7న రాత్రి నిందితుడు బత్తుల ప్రభాకర్ ఆలియాస్ బిట్టు ఆలియాస్ హరీశ్ ఆఫీస్ రూమ్ కిటికీలు పగులగొట్టి లోపలికి చొరబడి లాకర్‌లో ఉన్న రూ.7.80లక్షల నగదు దోచుకెళ్లాడు. అలాగే జనవరి 8న అర్ధరాత్రి అజీజ్‌నగర్ చౌరస్తాలోని వీజేఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆఫీస్ గదిలోకి చొరబడి లాకర్ తాళాలు పగులగొట్టి రూ.15.24లక్షల నగదు దోచుకెళ్లాడు. రెండు చోరీలు చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్న నిందితుడు ఇటీవల నగరంలోని గచ్చిబౌలిలో కాల్పులు జరిపిన కేసులో బత్తుల ప్రభాకర్‌ను అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితుడిని మొయినాబాద్ పోలీసులు ఈ నెల 22న కోర్టు అనుమతితో రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, డీఐ రమేశ్‌నాయుడు నిందితుడి చోరీలు చేసిన కళాశాలల వద్దకు తీసుకువెళ్లి సీన్ రీ కంస్రక్షన్ చేసి దొంగతనాలు ఎలా చేశాడో వివరాలు సేకరించారు. సోమవారం నిందితుడిని కోర్టులో హాజరు పర్చి చర్లపల్లి జైలుకు తరలించారు.

**షార్ట్ సర్క్యూట్‌తో కారులో చేలరేగిన మంటలు**

షాబాద్(మొయినాబాద్), ఫిబ్రవరి 24: షాట్ సర్క్యూట్‌తో కారులో మంటలు చెలరేగాయి. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట జరిగింది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ నగరానికి చెందిన రాహుల్ ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో చేవెళ్ల వైపు నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నాడు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న బస్‌స్టాపు వద్దకు రాగానే ఓవర్ హీట్‌తో ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అక్కడే ఆపి కారులో ఉన్నవారు కిందికి మంటలు అర్పారు. అప్పటికే ఇంజన్‌లోని వైరింగ్ మొత్తం కాలిపోయింది. అప్రమత్తమై వెంటనే కారు ఆపి కిందికి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**ఇసుక దారి మళ్లింపు ..రెండు ట్రాక్టర్లు సీజ్**

దోమ, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని దిర్సంపల్లి ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు పొంది ఇసుకను తరలిస్తున్న క్రమంలో పాఠశాలకు కాకుండా మరో ప్రాంతానికి ఇసుక దారిమళ్లించిన ఘటనలో రెండు ట్రాక్టర్ల యజమానులతో పాటుగా ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని కావలి రవి ట్రాక్టర్ నంబర్ ఏపీ 39,టీఎక్స్ 1351, ట్రాలీ నంబర్ ఏపీ 28 ఏసీ 9233, రెండవ వ్యక్తి అయిన చుక్కారెడ్డి ట్రాక్టర్ నంబర్ టీఎస్ 34 టి 5885, ట్రాలీ నంబర్ టీఎస్ 34 టి 5885 నంబర్లు గల ట్రాక్టర్లపై మండల రెవెన్యూ అధికారి ఆర్ఐ సుదర్శన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆ ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.